అలజడి

గబగబా ఆఫీస్‌కి వెళ్ళాలనే తొందరలో నడుస్తూంటే అరి పాదా లకి గట్టిగా ఏదో గుచ్చుకుంటోంది జానకిరాంకి.

ఆగి, రెండు బూటులేసులు వదులుచేసి రోడ్డుకి ప్రక్కనే బూట్లను విప్పాడు.

లోపల ఇసక వుంది.

బూట్లలోని ఇసకను పారబోసి, సాక్సుకూడా విప్పాడు. వాటిలో చేరుకొన్న ఇసకను దులిపి మళ్ళీ బూట్లని తొడుక్కున్నాడు.

దాదాపు గుప్పెడు ఇసకదాకా వుంది రెండు బూట్లలో కలిపి. ఆఫీస్‌కి టైమయిందన్న హడావిడిలో అడుగులు వేగంగా వేశాడు.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి విలాసిని ఒక్కతే వుంది.

"మీ అక్క, బావ లేరా ?" అడిగాడు కుర్చీలో కూర్చుంటూ.

"బట్టలు విప్పకండి. వాళ్ళు పాటకచేరీకి వెళ్ళారు. డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి. ఇవాళేగా ఆవిడ రమ్మని చెప్పింది.

"ఎలావుంది ఒంట్లో ?"

భార్యను ప్రేమగా దగ్గరకు తీసుకొంటూ అడిగాడు జానకిరాం.

"బాగానే వుంది."

"ఇంకో అయిదున్నర నెలల్లో బాబునిస్తావన్నమాట." నవ్వుతూ అడిగాడు, భార్య జుట్టుని కుడిచేత్తో మృదువుగా రాస్తూ.

"పాప, బాబుకాదు."

"అదేం ?"

ఆడపిల్లలే బాగుంటారు. మా అక్కయ్యని చూశారుగా. అలాంటి అమ్మాయిని కంటాను."

"నాకు బాబు కావాలనిపిస్తోందీ. మొదటి సంవత్సరం కొడుకయితే నేను ఉద్యోగంలోంచి రిటయిరయే సమయానికి ఎదిగివచ్చి...."

అబ్బో! చాలావుందే ఆశ మీకు" నవ్వింది విలాసిని.

వంట గదిలోకి వెళ్ళి అయిదు నిమిషాలలో కాఫీ కప్పుతో వచ్చింది.

ఇంటికి తాళంవేసి ఇద్దరూ డాక్టర్ దగ్గిరకు బయలుదేరారు.

విలాసిని రెండు నిమిషాలు మౌనంగా వుంది. తర్వాత భర్తతో చెప్పింది.

"మీకు తెలుసుగా, నా చిన్నప్పుడే నాన్నగారు పోయారు. మా అమ్మ వుండి లేనట్లే. ఆ గది దాటి బయటకు రాదు ఎప్పుడో కాని. ఏం పట్టించుకోదు. తన లోకంలో తనుంటుంది. నా కావిడని చూస్తే ఒకోసారి అనిపిస్తుంది. చూసేవాళ్ళు, చేసేవాళ్లు వుంటే పిచ్చివాళ్ళుగా మారటం ఉత్తమం అని. చీకూ చింత లేకుండా జరిగిపోతుంది జీవితం...."

"ఏమిటా మాటలు నేనుండగా?" జానకిరాం భార్య చేతిని మృదువుగా నొక్కి నవ్వుతూ అన్నాడు చిరుకోపంగా.

"మీరు చూడరానన్ను ఒకవేళ అలా...."

"ష్, ఏమిటా వెధవ ఆలోచనలు?"

రిక్షా మాటాడాడు జానకిరాం డిస్పెన్సరీకి.

"మీ అక్కయ్య అంటే అందుకే నాకు ఎంతో గౌరవం మనిద్దరినీ యెంతో ప్రేమగా చూస్తుంది. అందుకే వేరు కాపురం పెట్టడం నా కిష్టంలేదు. మా చుట్టాలు ఎన్నిసార్లు చెప్పినా."

"నిజానికి మా అక్కయ్య చిన్నప్పుడు మమ్మల్ని చూడకపోతే ఎలా పెరిగేదాన్నో, ఏమయి వుండేదాన్నో. పద్దెనిమిదేళ్ళకే, పెళ్ళయిన

నెల రోజులకే మా అందరికీ అండగా నిలిచింది. పేరుకి అక్కయినా, చిన్నప్పట్నించి అమ్మలా పెంచింది నన్ను. నన్నేకాదు, మా అమ్మను కూడా కన్నకూతురులా చూసుకొస్తోంది ఎంతమాత్రం విసుక్కోకుండా."

"ముఖ్యంగా మెచ్చుకోవాల్సింది మీ బావగార్ని, చాలా చాలా చాలా మంచివారాయన. 'ఎందుకు వీళ్ళకోసం శ్రమపడాలి' అన్న భావన ఆయనలో కలిగివుంటే పరిస్థితులు యింకో మాదిరిగా వుండివుండేవి బహుశా."

"అదీ నా అదృష్టం. మా అమ్మ అదృష్టం"

"మీ అక్కయ్యకి పిల్లలు పుట్టివుంటే మీరంటే వుండే ఆప్యాయత యింత వుండివుండేది కాదు."

చిన్నగా నవ్వి చెప్పింది విలాసిని.

"కావచ్చు. కాని నన్ను కన్నకూతురుకన్నా ఎక్కువగా చూసుకునేది చిన్నప్పుడు. నీళ్ళుపోసేది. వళ్ళుతుడిచి బట్టలు తొడిగి జడవేసేది. అన్నం కలిపి ముద్దలు నోట్లో పెట్టినరోజులు కూడా గుర్తున్నాయి నాకింకా."

రిక్షా ఆస్పత్రి ముందు ఆగింది.

డాక్టర్ విలాసినిని పరీక్షచేసి ప్రిస్క్రిప్షన్ వ్రాసిచ్చింది. వాటిని కొనుక్కుని, ఓ పావుగంటసేపు ఇంటికి వచ్చేదారిలో వున్న పార్కులో కూర్చున్నారు.

పుట్టబోయే బిడ్డ గురించి మాటాడుకున్నారు ఇద్దరూ ఎలా పెంచాలి, ఏం పేరు పెట్టాలి మొదలయిన విషయాలు.

బాగా చీకటిపడ్డాక ఇంటికి చేరుకున్నారు. విలాసిని అక్కయ్య దగ్గర ఇంటితాళం డూప్లికేట్ తాళంచెవి వుండటంవల్ల, కచేరీనుంచి తిరిగి వచ్చి వంట ప్రయత్నంలో వుంది.

"డాక్టర్ ఏమన్నారు?" అడిగాడు విలాసినిని ఆదిలక్ష్మి భర్త.

"మందులు రాసిచ్చింది."

ఆదిలక్ష్మి చెప్పింది చెల్లెలితో —

"కంచాలు పెట్టు, వంట అయింది."

ఆదిలక్ష్మి ఓ కంచంనిండా అన్నం, కూర మొదలయినవి సర్ది తన తల్లి ముందు వుంచింది. ఆవిడకి ఆకలి వేసినప్పుడు అర్ధరాత్రెప్పుడో తింటుంది. తర్వాత స్నానాల గదిలోకి వెళ్ళి, స్నానంచేసి పడుకుంటుంది. ఇంట్లో యెంతమంది వున్నా ఆవిడ ఎవరితో మాటాడదు. ఎవరయినా పలకరించినా సమాధానం చెప్పదు.

"నా కిష్టమయిన పచ్చడి చేసారే" అన్నాడు, జానకిరాం కొత్తిమీర పచ్చడిని కలుపుకుంటూ.

"పాట కచేరీనుంచి తిరిగివస్తూంటే కనబడింది. లేతగా నవనవ లాడుతూంటే పావలాది కొనుక్కొచ్చాను" చెప్పింది ఆదిలక్ష్మి మరిదికి.

మొదటిముద్ద నోట్లో పెట్టుకుని నమలగానే నాలిక చురుక్కుమంది. నోరు మండిపోసాగింది. ఎలాగో ఆ ముద్ద మింగి "అబ్బా! మంట" అని గబగబా గ్లాసెడు నీళ్ళు తాగాడు జానకిరాం.

"కారం ఎక్కువయిందా మీకు ?" అడిగింది విలాసిని భర్తని, ఎర్రబడ్డ అతని మొహాన్ని, కళ్ళలోంచి కారే నీళ్ళని చూసి.

"అవును, చాలా."

"అట్టే కారంలేదే" అన్నాడు ఆదిలక్ష్మి భర్త పచ్చడి వేలితో రుచి చూసి.

"లైట్‌గా కలుపుకోండి."

విలాసిని భర్త కంచంలోని పచ్చడి అన్నం ప్రక్కకి తోసేసి తనే కలిపింది మళ్ళీ.

"డాక్టరేమంది ?" అడిగింది ఆదిలక్ష్మి చెల్లెలిని."

"బలాని కనుకుంటాను. టానిక్‌లు రాసి యిచ్చింది."

ఆ రాత్రి చెప్పాడు జానకిరాం విలాసినితో.

"రేపు తెలుస్తుంది ఆఫీస్‌లో నా బదిలీ గురించి."

విలాసిని మాటాడలేదు. ఆమె మౌనంలోని అర్థం గ్రహించి, దగ్గిరికి తీసుకుని చెప్పాడు.

"ఆపుకోడానికే ప్రయత్నిస్తున్నాను. వాళ్ళంతటా వాళ్ళే బదిలీ చేస్తే యేం చేయగలను చెప్పు."

"ఎలాగయినా మీ ఆఫీసర్‌తో చెప్పి బదిలీ అవకుండా చూడండి. ఆమాత్రం చేయలేరా?"

"అన్నివిధాలా ప్రయత్నిస్తున్నాను."

"ప్రయత్నించడంకాదు. వెళ్ళనని మొండికేయండి."

నవ్వాడు జానకిరాం.

"నీ సలహా పాటిస్తే ఇంక ఆఫీస్ కెళ్ళాల్సిన అవసరం వుండదు. ఇంటి దగ్గిరే కూర్చోవాలి."

ప్రక్కగదిలో ఆదిలక్ష్మి ఉతికిన బట్టలు మడతపెట్టి వచ్చి భర్త పక్కన పడుకుంది.

ఆదిలక్ష్మి భర్త భార్యచేతిని మృదువుగాపట్టుకొని సుతారంగా మీదకి లాక్కున్నాడు.

ఆదిలక్ష్మి బలమంతా ఉపయోగించి పక్కకి తిరిగి పడుకుంది భర్తను దూరంగా తోసి.

కొన్ని క్షణాలు విభ్రాంతపోయా డాయన భార్య ప్రవర్తనకి.

"ఎందుకా కోపం? అడిగాడు లాలనగా. ఆదిలక్ష్మి జవాబుచెప్పలేదు.

భార్య చీర కొనమని ఈ మధ్యకాలంలో ఎప్పుడయినా అడిగితే తను మర్చిపోయాడా, లేక ఆరోజు భార్య పుట్టినరోజయితే ఆ సంగతి తను గుర్తు పెట్టుకోలేదా అని ఆలోచించసాగాడాయన.

ఆ ప్రక్కగదిలో ఆదిలక్ష్మి తల్లి దొండకాయ కూరలోంచి,

చక్రాలుగా తరిగిన ముక్కలను జాగ్రత్తగా ఏరితీసి పక్కపిన్నీనుకి శ్రద్ధగా గుచ్చసాగింది.

పూర్తిగా గుచ్చాక ముక్కలన్నిటినీ ఒక్కసారిగా నోట్లో వుంచుకొంది పక్క పిన్నీసుతోనే.

తర్వాత పగలబడి నవ్వసాగింది.

* * *

"ఆబిడ్స్"

కండక్టర్ దగ్గిరకి రాగానే చెప్పాడు జానకిరాం, కండక్టర్‌కి నలభై పైసలివ్వడానికి చొక్కాజేబులో చెయ్యిపెట్టాడు జానకిరాం.

ఖాళీగా వుంది జేబు. చిల్లర జేబురుమాలు లేదు.

పాంట్ జేబులో చేతినుంచాడు.

పర్స్ లేదు.

బేక్ పాకెట్‌లో చిల్లర వుందేమోనని తడిమి చూశాడు.

చిల్లర జేబులో ఏమీలేదు.

పర్స్ ఎవరయినా కొట్టేసారా?

కండక్టర్ టికెట్ చింపకుండా తన చేత్తో అతని చేతిని ఆపి చెప్పాడు.

"సారీ బ్రదర్" డబ్బు ఇంటిదగ్గిర మరచి వచ్చాను. దిగిపోతాను."

తర్వాతి స్టాప్‌లో బస్ దిగి పది నిముషాల్లో ఇంటికి చేరుకున్నాడు.

"వచ్చేసారే? ఆఫీస్‌కి వెళ్ళలేదా?" అడిగింది విలాసిని ఆశ్చర్యంగా.

"నా జేబులో చిల్లర, పర్స్, రుమాల, దువ్వెన ఏమీలేవు. ఇంకో పేంట్ జేబులోకి మార్చావా?" చిరాకుగా అడిగాడు భార్యని.

"లేదే."

"మరయితే ఏమయినట్లు?"

విలాసిని తన గదిలోని టేబిల్ మీద, టేబిల్ కుండే డ్రాయర్ సొరుగులో వాటికోసం చూసింది.

లేవు.

"చిత్రం. ఏమయినట్లు? ఎవరో కొట్టేసి వుంటారు" అన్నది.

భార్య దగ్గర ఓ ఐదు రూపాయలు అడిగి తీసుకున్నాడు ఆటోలో ఆఫీసు కెళ్ళడానికి.

"ఆయన ఎందుకు మళ్ళీ వచ్చారు" ఆదిలక్ష్మి అడిగింది చెల్లెలిని జానకిరాం వెళ్ళాక.

"పర్స్ పోయిందట."

సాయంత్రం ఆఫీసునుంచి తిరిగివచ్చాక విలాసిని భర్తకి పోయిన వస్తువులన్నీ అందించింది.

"ఎక్కడున్నాయ్?" అడిగాడు.

"మరీ అంత నిర్లక్ష్యం అయితే ఎలాగండీ? చాకలి వాడికి వేయాల్సిన బట్టల బుట్టలో అడుగున వున్నాయి.

"నాజేబులోంచి అక్కడి కెలా వెళ్ళాయి?" విస్మయంగా అడిగాడు జానకిరాం.

"మీకే తెలియాలి."

"నాకు నిజంగా తెలీదు."

"ఏమో! కాని వాటికి కాళ్ళయితే మొలవలేదు" నవ్వింది విలాసిని.

* * *

"ఈ బట్టలన్నీ ఎవరు ఇలాపాడుచేసింది? అసహనంగా అడిగాడు జానకిరాం భార్యని.

నిర్ఘాంతపోయి చూసింది విలాసిని తెరచి వున్న సూట్‌కేస్‌లోని భర్త బట్టల వంక. ఇస్త్రీ మడతలుపెట్టి వున్నాయి బట్టలు దొంతరలుగా.

వాటిమీద మెత్తగా నూరిన నల్లటి బొగ్గు పొడి చల్లివుంది. ఆ పొడి చల్లి, తర్వాత మళ్ళీ నీళ్ళు చల్లిన గుర్తుగా అక్కడక్కడా బట్టలకి మరకలు అంటుకొని వున్నాయి అసహ్యంగా.

ఆ దొంతరలోవున్న అన్ని జతలనిండా బొగ్గుపొడి, నీళ్ళు చల్ల బడి వున్నాయి.

"ఇదెవరి పని ?" అడిగాడు మళ్ళీ.

"నేనంటారా ? నాకేమయినా పిచ్చిపట్టిందా మీ బట్టలు పాడు చేయడానికి ? నేనే చేసివుంటే మళ్ళీ ఉతకాల్సింది నేనేగా ?"

"ఛ, నీవు చేసావని అనటంలేదు నేను." ఆలోచనగా అన్నాడు జానకిరాం.

"ఒకవేళ మా అమ్మ పనేమో ఇది ?"

"ఆవిడా ? ఆ గది దాటి బయటికి రాదుగా ఎప్పుడో కాని. సీలింగ్ ఫేన్‌వున్న గదిలోకి రావాలంటే ఆవిడకి భయం గదా. అసలు నీకు పెళ్ళయిందనీ, నేను నీ భర్తననీ కూడా తెలియదు ఆవిడకి, ఆవిడది మన లోకంకాదు."

"నిజమే కానీ...."

"నీ బట్టలు చూడు. వాటికేం కాలేదు. కేవలం నా బట్టలమీదే బొగ్గు పొడి చల్లి పాడుచేసారు. వాళ్ళెవరో కానీ, నేనంటే ఇష్టం లేదను కుంటాను."

"ఈ ఇంట్లో మీరంటే అందరికీ అందరికీ గౌరవంవుంది. మీరంటే ద్వేషం ఎవరికీ లేదు."

జానకిరాం కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తర్వాత అన్నాడు నిస్పృహగా.

"ఇప్పుడెలా ఆఫీస్‌కి వెళ్ళడం ?"

"నిన్న విడిచినవే వేసుకెళ్ళండి ఇవాల్టికి. సాయంత్రానికల్లా ఉతికి ఇస్త్రీ చేయిస్తాను వాటిని."

విలాసిని బట్టల స్టాండ్‌కి వేలాడుతున్న విడిచిన పేంట్, షర్ట్‌లని అందించింది భర్తకి.

చొక్కా తొడుక్కుని అన్నాడు.

"గుండీ లేవి?"

"ఏం గుండీలు?"

"చొక్కాకి గుండీలు లేవు. ఎవరో కోసేసారు" అన్నాడు జానకిరాం చొక్కాని తేరిపార చూసి.

గబగబా పేంట్‌ని కూడా తిరగేసి చూసి, చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

"పేంట్‌కి కూడా గుండీలులేవు నే నివాళ ఆఫీస్‌కి వెళ్ళటం ఇష్టం లేక నీవే చేసవుంటావ్ ఈ పని."

"నేను కాదు."

విలాసిని కొద్దిగా భయంగా, విస్మయంగా చెప్పింది.

"వాటికి గుండీలు త్వరగా కుట్టు. వెళ్ళాలి."

అరగంటలో విలాసిని భర్త దుస్తులకి బటన్స్ కుట్టింది. ఇద్దరు తమ తమ ఆలోచనలతో మౌనంగా వుండిపోయారు.

బూట్లు తొడుక్కొంటూంచే లోపల ఏదో మెత్తగా తగిలితే, కాలు బయటకి తీసి బూటుని గట్టిగా దులిపాడు జానకిరాం.

కుడికాలి బూట్లోంచి గుప్పెడు ఇసక నేల మీద రాలింది. అను మానం వచ్చి ఎడంకాలి బూటు కూడా దులిపాడు. సూదుల్లా వుండే చిన్న చిన్న కంకర రాళ్ళు బయటపడ్డాయి. గుండు సూదులతోపాటుగా.

వాటిని చూసి విలాసిని భయంగా భర్త చేతిని పట్టుకుంది వెంటనే. ఇద్దరూ కొన్ని క్షణాలు మాట్లాడలేదు.

"చేతబడేమో?" అన్నది వణికే కంఠంతో.

"చేతబడా?"

భార్య మొహంలోకి చూసాడు జానకిరాం. అతని మొహంలో కూడా కొద్ది క్షణాలు భయం చోటు చేసుకుంది.

"నా మీద ఎవరికి వుంటుంది అంత ద్వేషం? కాకపోవచ్చు." అన్నాడు.

"మరయితే ఇవి...."

"మనుషులపనే అయివుండాలి."

"కొత్త వాళ్ళెవరూ రాలేదుగా ఇవాళ?"

జానకిరాంకి కూడా బోధపడలేదు అవి తన బూట్లలోకి ఎలా వచ్చాయో!

భర్త ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడు చెప్పింది విలాసిని నాలుగు నిముషాల తర్వాత.

"జాగ్రత్తండి."

"నువ్వేం కంగారుపడకు."

భార్యకి ధైర్యం ఇవ్వడానికి నవ్వాడు జానకిరాం ప్రయత్నపూర్వకంగా.

విలాసిని జరిగింది ఆదిలక్ష్మికి చెప్పింది.

"విచిత్రం, ఎవరు చేసి వుంటారు? అన్నది ఆశ్చర్యంగా ఆదిలక్ష్మి.

* * *

విలాసిని బాయిలర్‌లోంచి వేణ్ణీళ్ళని బక్కెట్లోకి తోడింది భర్త స్నానం చేయడానికి. టవల్ బాత్‌రూం తలుపు మీదవేసి భర్తని కేకేసింది.

రెండు చెంబుల నీళ్ళు నెత్తిమీద పోసుకున్నాక ఆ నీళ్ళు అదో మాదిరిగా వున్నట్లనిపించింది జానకిరాంకి. ఇంకో రెండు చెంబులు పోసుకున్నాక, అనుమానం తీర్చుకోడానికి కుడిచేతి చూపుడు వేలుని నోట్లో పెట్టుకుని నాకి చూసాడు. తర్వాత గుప్పెడు నీళ్ళని నోట్లో పోసుకుని రుచి చూసాడు.

"విలాసినీ."

భార్యని గట్టిగా పిలిచాడు బాత్‌రూం తలుపు తెరచి.

"ఏమిటీ ?"

పరిగెత్తుకొచ్చింది విలాసిని. కిటికీలోంచి బాత్‌రూం వంక చూసింది ఆదిలక్ష్మి.

"ఈ నీళ్ళలో ఉప్పు ఎవరు వేసారు?" అడిగాడు.

"ఉప్పా?"

"అవును. సముద్రం నీళ్ళలా ఉప్పగా వున్నాయి ఇవి."

విలాసిని కూడా ఆ నీళ్ళని రుచిచూసి అన్నది ఏదో గుర్తువచ్చిన దానిలా.

"అక్కయ్య వేసిందేమో?"

"మీ అక్కా! ఆవిడకేం పని!"

"ఇందాక మా అందరి స్నానాలు అయాక రెండు గుప్పెళ్ళనిండా ఉప్పు తీసుకువస్తూంటే చూసాను. కొబ్బరి మొక్క మొదట్లో వేయడాని కనుకున్నాను."

జానకిరాం దూరంగా వున్న కొబ్బరి మొక్క దగ్గరికివెళ్ళి చూసాడు.

ఉప్పు లేదక్కడ కనీసం నీళ్లు కూడా పోసిన సూచనలేదు.

"మీ అక్కయ్యే వేసివుంటుంది" అన్నాడు పెళ్లాం దగ్గరకి వచ్చి.

అర్థం కానట్టుగా చూసింది విలాసిని భర్త మొహంలోకి!

"తప్పకుండా ఇది ఆవిడ పనే అయివుండాలి.

విలాసిని పెదవి విప్పలేదు. ఆలోచిస్తోంది నిజంగా ఇది అక్కయ్య పనేనా ? అయితే, ఎందుకు?

"నిన్న నా బట్టలమీద బొగ్గుపొడి చల్లిందీ, నా బూట్లలో ఇసక పోస్తున్నదీ కూడా ఆవిడే అయివుండాలి.

"ఆవిడకేం లాభం?"

జానకిరాం వెంటనే మాట్లాడలేదు ఆలోచిస్తూండిపోయాడు చాలా సేపు తర్వాత అన్నాడు.

"తొట్లో నీళ్ళు ఓ బక్కెట్ తెచ్చి పెట్టు వేరే బకెట్లో. ఇవాళ చన్నీళ్ళ స్నానం చేస్తాను."

"అక్కయ్యని అడుగుతా నుండండి. ఎందు...."

"వద్దు. అప్పుడే అడగక."

"ఏం?"

"వద్దన్నానంతే. అడగక."

జానకిరాంకి వడ్డించిన కూరలో పిసరంత కూడా ఉప్పులేదు. చప్పగా వుంది. ఎవరూ చూడకుండా రహస్యంగా భార్యకి కొద్దిగా రుచి చూపించాడు సౌజ్ఞచేసి.

భోజనం అయి తమ గదిలోకి వెళ్ళాక అడిగింది విలాసిని కంగారుగా.

"ఎందుకిలా ప్రవర్తిస్తోంది ఆదిలక్ష్మి?"

"మీ అక్కయ్యని ఏం అడగక అప్పుడే."

సాయంత్రం త్వరగా వచ్చాడు జానకిరాం ఆఫీస్‌నుంచి. బయటకి తీసుకెళ్ళాడు విలాసినిని.

"ఎందుకు మా అక్కయ్యని అడగవద్దన్నారు? ఆవిడలో ఏమిటీ వింత ధోరణి కొత్తగా?" అడిగింది విలాసిని.

భార్య మొహం చూస్తే ఆలోచనలతో సతమతమవుతున్నట్టుగా అనిపించింది జానకిరాంకి.

"ఆలోచించాను అదే విషయం. నాకు అట్టే బోధపడలేదు.

"అడుగుదాం. తప్పేముంది?"

"నాకు కారణం బోధపడింది."

"ఏమిటి?" ఆత్రంగా అడిగింది.

"తన కళ్ళముందే పెరిగి గౌనుల్లోంచి, ఓణీల్లోంచి, చీరల్లోకి వచ్చిన నీకు పెళ్ళయి నెల తప్పింది. త్వరలో బిడ్డ పుట్టబోతున్నాడు. ఆవిడ కా అదృష్టం కలగలేదు- ఇంతదాక, ఇన్ని సంవత్సరాలయినా. తనకి ఎన్నటికీ పిల్లలు కలగరనే నిజం ఆవిడని చాలాకాలంగా బాధిస్తూం డాలి. బహుశ ఆ బాధని తనలో తాను అణచుకుంటూండాలి ఇంతకాలం. కాని నీవు గర్భవతివని తెలిసిన క్షణంనుంచి అణచిపెట్టిన ఆవిడ బాధ తిరిగి రగులుకొని వుండాలి."

"అయితే?"

"ఆవిడలోని ఫ్రస్ట్రేషన్ బయటపడింది. అసూయ రూపంలో. నా వూహ మాత్రమే ఇది."

"అసూయా? ఎవరిమీద? నామీద అసూయ వుంటే మిమ్మల్ని దేనికి హింసించటం?"

"నీ మీద కాదు. నామీదే."

"మీ మీదా ? బిడ్డని కనేది నేనుగా? మీరు గర్భవతి కాదుగా?"

చిన్నప్పటినుంచీ నిన్నెంతో ప్రేమగా పెంచింది. నిన్నే ద్వేషిద్దామన్నా ఆవిడకి అది సాధ్యపడక పోవచ్చు. నేను పరాయి వాడిని."

"అందుకని మిమ్మల్ని ద్వేషిస్తోందా ?"

"అవును. నీ మీద వుండాల్సిన అసూయ లోంచి పుట్టే ద్వేషం నా మీదకి మరల్చుతుంది. నీకు నెల తప్పడానికి కారణం నేనేగా. బహుశ ఇంకెప్పటికీ పిల్లలు తనకి పుట్టరనే బాధని కంట్రోల్ చేసుకోగలిగినట్లుగా నామీది ద్వేషాన్ని అణచుకోలేక ఇలా చేస్తోంది అనుకొంటాను"

"మా అక్కయ్య అలాంటిది కాదు. నే నంటే...."

"కావచ్చు. కాని ఇదో మానసిక దౌర్బల్యం."

అయితే ?"

"ఆవిడ ద్వేషం....అదే....దౌర్బల్యం ఇంకా ప్రారంభ దశలోనే వుంది నీకు నెలలు నిండిన కొద్దీ ఎక్కువ అవచ్చు."

విలాసిని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నామీద ద్వేషం తక్కువస్థాయిలో వుండటంవల్ల రహస్యంగా చిన్నచిన్న పన్లతో సరి పెట్టుకుంటోంది. అదే ఎక్కువయితే ఆవిడ ఏమయినా చేయచ్చు....చంపచ్చు కూడా."

"అమ్మో!"

తన గుండెలమీద చేతిని వుంచింది విలాసిని భయంగా.

జానకిరాం మాట్లాడలేదు.

"అయితే అక్కయ్య మా అమ్మలా...."

"అందుకే బదిలీ చేయించుకున్నాను. కొద్దికాలం దూరంగా వుందాం. మానసికంగా ఆవిడకి కావలసినంత విశ్రాంతి కావాలి. మనం కళ్ళ ఎదుట తిరుగుతుంటే అది కరువవుతుంది. పైగా పగ, ద్వేషం ఎక్కువయి అది ఎవరి మీదనయినా మళ్ళచ్చు నామీదనుంచి. లేదా ఉన్మాదంలోకి దింపచ్చు."

విలాసిని ఏడుస్తోంది నిశ్శబ్దంగా.

"సారీ, నీకు బాధవేస్తుందని తెలిసినా చెప్పక తప్పలేదు."

కొన్ని నిముషాల తర్వాత కళ్ళు తుడుచుకుని చెప్పింది విలాసిని.

"అక్క మనసు కుదుటపడటం కావాలి. నాకు అది ముఖ్యం."

* * *

పదిహేను రోజుల తర్వాత విలాసిని తన భర్తవెంట విశాఖపట్నం వెళ్ళిపోతుంటే ఆదిలక్ష్మి చెల్లెలిని కౌగలించుకుని గట్టిగా ఏడ్చింది.

"చిన్నప్పట్నించి పెంచాను. వెళ్ళిపోతున్నావ్. ఇంతదాకా నిన్ను వదలి వుండలేదు."

విలాసిని కూడా ఏడుపు ఆపుకోలేకపోయింది. జానకిరాం కళ్ళలో కూడా నీళ్ళు తిరిగాయ్.

రైల్వేస్టేషన్‌కి వచ్చారు విలాసిని అక్కయ్య బావ వీడ్కోలు ఇవ్వడానికి.

రాత్రి ఎనిమిదిన్నరకి అక్కయ్య చేసిచ్చిన అరిసెలు బయటకు తీసింది విలాసిని రైల్లో.

ఒకటి తుంపి నోట్లో వేసుకుని నమలసాగింది.

"నీకు అరిసెలు సయించవుగా ?" అన్నాడు జానకిరాం ఆశ్చర్యంగా భార్య అరిసె తినడం చూసి.

అరిసెలన్నిటినీ కిటికీలోంచి బయటకు విసిరేసింది విలాసిని కొద్దిగా కోపంగా.

"మీకోసం చేసింది ఇనక" అన్నది.

భార్య కళ్ళలో నీళ్ళు తిరగడంచూసి లాలనగా అన్నాడు జానకిరాం.

"మీ అక్కయ్యే కొన్ని సంవత్సరాల తరువాత మళ్ళీ మనల్ని హైదరాబాద్ బదిలీ చేయించుకోమని అడగవచ్చు. ఆ అవసరం కలగచేయడానికే. ఆవిడ మనసు కుదుటపడటానికే మనం దూరం అవుతున్నాం. ఇది తాత్కాలికమే."

"మీకా నమ్మకముందా ?"

బదులుగా జానకిరాం కిటికీలోంచి బయటకు చూడసాగాడు. బయటంతా చిమ్మచీకటి.

దూరంగా మిణుకు మిణుకుమంటూ ఎగురుతున్నాయి మిణుగురు పురుగులు.

(జ్యోతి మంత్లి 1980)